స్కెచ్

# నిజం చెప్తే-

పావనరాం

పాలఘాట్ కేఫ్‌లో కాఫీ సేవిస్తున్నాం.

ఇంతలో మల్లులాల్చీ గ్లాస్కో పంచలతో ఒకాయన లోపలకొచ్చారు.

ఆయన్ని చూడగానే మావాడు "రండి! రండి మూర్తిగారూ" అని ఆహ్వానించాడు.

"అన్నట్టు మీకు ఇతన్ని తెలుసునా?" అని నన్ను ఆయనకి పరిచయం చేశాడు.

"ఆ మధ్య వారపత్రికలో "శరచ్చంద్రాత్రుల యదార్థ దృశ్యాలు" చదివారా?" అన్నాడు.

"ఔనూ!" అన్నారాయన.

"ఆ రచయిత వీడే" అన్నాడు.

" 'వెరిగ్లాడ్ టు మీట్ యు' మీ కథ చాలా బాగుందండీ" అని ఓ కాంప్లిమెంటు పడేశారు.

నాముఖం చేటంతయింది.

"ఈయన ప్రఖ్యాత కథకులు మూర్తిగారు. వివిధ నామాంతరంబులతో చాలా కథలు రాశారు" అన్నాడు చిరునవ్వుతో—

ఆనాటి మా సమావేశం పరస్పర అభివందనాల్తో ముగిసింది.

తర్వాత మావాడన్నాడు.

"సన్‌ఫ్లవర్" అనే పేరుతో చాలా కథలు రాశారీయన. చాలా బాగా రాస్తారు. చాలా సహజంగాను, గంభీరంగాను ఉంటాయి ఈయన కథలు.

*          *          *

ఓనాడు ప్రొద్దుటే మావాడు మూర్తిగారితో సహా మాయింటికి వచ్చాడు.

ముగ్గురం ఈమాటా, ఆమాటా మాట్లాడుకొన్నాం.

చివరకి మూర్తిగారన్నారు.

"మనఊళ్లో చాలామంది రచయితలున్నారు. ఉన్నవాళ్ళంతా పదిహేనురోజులకోసారి ఒకచోట కలుసుకొని, ఒకళ్ళ ఉద్దేశాలు ఇంకోళ్ళకి తెలియ జేసుకొంటూఉంటే చూడండి ఎంత బాగుంటుందో. ఈ ఉద్దేశంతోనే "రచయితల సంఘం" అని పెట్టాం. కనుక మీరు తప్పక మెంబరు కావాలి" అన్నారాయన.

"బడ్డింగ్ రైటర్‌వి గా. "ఊ" అను. పెద్ద పెద్ద రచయితలంతా ఇందులో మెంబర్లుగా ఉన్న వాళ్ళే" అని ఓపుల్ల వేశాడు మావాడు.

"మీ రింతగా చెప్పాలా నలుగురితో పరిచయం నీకూ చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది" అన్నాను.

ఆనాటితో నేను "అభ్యుదయ రచయితల సంఘ" సభ్యుణ్ణయ్యాను—దాంతో నేనూ-ఓ అభ్యుదయ రచయితని అయిపోయాను. సునాయాసంగా లభించిన ఈ సభ్యత్వానికి నాలో నేను చాలా మురిసిపోయాను.

రెండుమూడు సమావేశాలయ్యాయ్! అందరూ ఒకళ్లనొకళ్లు తెగపొగుడుకున్నారు!! ఎప్పుడూ చదువు, డిపార్ట్‌మెంటు గొడవలు మాట్లాడుకునే మిత్రులకన్న-ఈ "రచయిత మిత్రులు" - నాకో విధంగా "రిలీఫ్" ఇచ్చారనే చెప్పాలి.

క్రమంగా మూర్తిగారు నేను మంచి స్నేహితులమయ్యాం.

బీచ్‌లో కూర్చున్నాం - నేనూ, మూర్తిగారూను.

"రెండునెల్లక్రితం మీరెవరో నాకు తెలియదు నేనెవరో మీకు తెలియదు. అప్పుడే మనం ఎంత "థిక్ ఫ్రండ్స్" అయ్యామో చూడండి" అన్నారాయన.

"సఖ్యము సాప్తపదీనం" కదండీ అన్నా— నాకొచ్చిన ఒకే ఒక సంస్కృత నానుడిని వదుల్తూ.

"ఈ మధ్య ఏమేనా మళ్ళీ రాస్తున్నారా?" అని అడిగారు.

"అబ్బే లేదండి. ఇంకా బాగా అలవాటు పడాలండీ" అన్నా. మొన్న నే తిరిగివచ్చేసిన నా కథలగురించి ఏమీ ఆయనతో అనలేదు.

"రాస్తూ ఉండండి. అదే అలవాటు అవుతుంద"న్నారు.

"అన్నట్టు మీరురాసిన కథలన్నింటినీ వేరే తీసి ఉంచానన్నారు. నాకోసారి ఇవ్వాలండీ" అన్నాను.

"దానికేముందండీ! ఈవాళే తీసుకొందురు గాని—"

ఆ సాయంకాలం ఆయన ఇంటికి వెళ్ళి ఆయన కథలు (పత్రికల్లో పడినవన్నీ) తీసుకొచ్చాను.

* * *

మళ్ళీ ఓ వారాన్ని కలుసుకొన్నాం.

"ఏమండీ ఎల్లాఉన్నాయ్?"అన్నారు "కాజువల్‌గా ఆయన కథల్ని ఉద్దేశిస్తూ. "నిర్మొహమాటంగా చెప్పండి. నాక్కావలసింది ఇమ్‌పెర్సనల్ క్రిటిసిజమ్."

"చాలా బాగున్నాయండీ. దాంట్లో"నదీసైకతాలు"అద్భుతంగా ఉంది. "ఇదే"ఏమిటిలెండి. అన్నీ చాలా బాగున్నాయ్! అందులో ఇది మరీ బాగుంది."

నే నంటున్నవన్నీ ఆయన చాలా జాగ్రత్తగా వింటూనే ఉన్నారు. అయినా నేనల్లా అనుకోకుండా ఉండడానికని కాబోలు, గోడమీద సినిమా ఎడ్వర్టయిజ్‌మెంటు చూస్తున్నట్టు ఏంగ్యులర్ పోజ్‌లో నిలబడ్డారు.

నేనల్లా ఓ ఐదునిముషాలు ప్రశంసించేశాను. ఓకిళ్ళీకొని ఆయన నా కిచ్చారు.

"కాఫీ తాగుదాంరండీ" అని బలవంతాన క్లబ్‌లోకి లాక్కుపోయారు.

* * *

ఆవేళే వారపత్రిక వచ్చింది. అందులో "సన్‌ఫ్లవర్"గారి కథ ఉంది. దగ్గరగాఉన్న పార్కులోకి వెళ్ళి కథ చదివాను.

మరునాడు మళ్ళీ నేనూ, మూర్తిగారూ కలుసుకొన్నాం.

"ఏమండీ నాకథ చూశారా?" అన్నారు.

"చదివానండీ" కాస్త తటపటాయించి అన్నా.

"అనవసరంగా పెంచినట్లుంది. దీన్నే ఇంకా కుదిస్తే చదివేవాడికి ఇంటరెస్ట్ ఇంకా ఎక్కువయ్యేది" అని ఉన్నాను.

"అప్పుడే ఓ పెద్ద "క్రిటిక్"లా మాట్లాడుతున్నావే? అన్నట్లు మొఖంపెట్టి టైం చూసుకొని..."ఓ చిన్న ఎంగేజ్‌మెంటు ఉందండీ వస్తా" అని వెళిపోయా డాయన, మరునాడు మూర్తిగారింటికి వెళ్ళా.

"మూర్తిగారూ" అని తలుపుతట్టాను.

"ఇంట్లోలేరని చెప్పు" అన్న మాటలు వినబడ్డాయ్.

ఆయన చిన్న అబ్బాయి తలుపుతీసి "మా నాన్నగారు ఇంట్లోలేరని చెప్పమన్నారండీ" అన్నాడు!

---

# రంగుమార్చిన రామన్న

## వై. వి. శర్మ.

సారవాపంటలు వచ్చిచేరుకున్నాయి. వెంకట్రావు పంతులుగారి భూములన్నీ మగతా కిచ్చినవే. ఆయన పూర్వీకులంతా పెద్ద జమీందారులే. ఆయన యిప్పుడు ఒక మాధ్యమిక తరగతికి చెందిన కుటుంబీకుడు. తనకున్న పదిఎకరాలనుండి వచ్చేరాబడితోనే అన్నీ సర్దుకోవాలి. అంటే, ఇద్దరు కుర్రవాళ్ళనూ కాలేజీలో చదివించటం; తన సంసారమూ; మోయలేని భారాన్ని మోస్తున్నారంటుంది అతని భార్య. నిజమే. కాని ఈ అధునాతన ప్రపంచంలో, తనకొడుకులు గ్రాడ్యుయేట్సు అయినా కాకపోతే వారి జీవనోపాధికి మార్గం చూపించినవాడిని కానని పంతులుగారి భయం. అదీకాక తనకొడుకులు పట్టభద్రులు కావాలని ఆయన ఉదాత్త ఆశయం.

ఆయనకు రైతులంటే ఎంతో ప్రేమ; ఆదరమూ; కాని పంతులుగారి ప్రేమనూ, ఆదరాన్నీ చులకనగా తీసుకుంటున్నారు రైతులు. రామన్న, పంతులుగారి రైతులలో ఒకడు. అతని